

విగ్రహ వివాదం.. ఉద్రిక్తత

యాచారంలోని మొండిగౌరెల్లి చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది.

8లో▸

జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్ మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణ సంస్థలో జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హ్యాండ్ బ్యాగ్, ల్యాప్ టాప్ బ్యాగ్, లగేజ్ బ్యాగ్, ఫోల్డర్స్ తదితర 10 వెరైటీ బ్యాగుల తయారీలో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 94949 59108.

మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.కిరణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన మహేందర్‌రెడ్డి బదిలీపై ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కిరణ్‌కుమార్ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై మీర్‌పేటకు వచ్చారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి బాధ్యతలను కిరణ్‌కుమార్‌కు అప్పగించారు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రానివ్వం



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ తిరుపతిరావు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య లేకుండా చూస్తామని కలెక్టర్ హరీశ్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, సేకరణ ప్రక్రియ పర్యవేక్షణపై బుధవారం మంత్రి గంగుల కమలాకర్, సివిల్ సప్లై శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. జిల్లాలో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యంతో 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 3,528.920 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైస్‌మిల్లుల వద్ద స్థల సమస్య ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఎస్ఓ మనోహర్‌రాథోడ్, జిల్లా సహకార సంస్థ అధికారి ధాత్రిదేవి, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్యామారాణి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ చాంపియన్‌షిప్ రెఫరీగా పాషాభాయ్

షాద్‌నగర్‌రూరల్: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో నిర్వహించే 45వ సబ్ జూనియర్ జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రెఫరీగా పట్టణానికి చెందిన వాలీబాల్ కోచర్ పాషాభాయ్ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఎంపిక పత్రం అందుకున్నారు. ఈ నెల 28 నుంచి నిర్వహించే ఈ పోటీలకు పాషాభాయ్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సెక్రటరీ హన్మంత్‌రెడ్డి, ప్రసాద్, రెఫరీ బోర్డు చైర్మన్ గణపతి, రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శాంతకుమార్, హనీఫ్, చిన్నవీరయ్య, బషీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు న్యాయనిర్ణేతగా ఎంపికైన పాషాభాయ్‌ని పలువురు అభినందించారు.

ఎమర్జెన్సీ లైటులో బంగారం

శంషాబాద్: అక్రమంగా తీసుకొస్తున్న బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం దుబాయ్ నుంచి ఎమిరెట్స్ ఎయిర్‌లైన్స్ వచ్చిన ప్రయాణికుణ్ని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతని లగేజీలో ఉన్న ఎమర్జెన్సీ లైటు విప్పి చూశారు. లైటు వెనకాల ఉన బ్యాటరీ స్థానంలో నల్లటి కాగితంతో చుట్టిపెట్టిన 2.915 కిలోల బంగారు బిస్కెట్ బయటపడింది. దీని విలువ రూ.1.81 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు బంగారం స్వాధీనం చేసుకుని నిందితుణ్ని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోక్షమెప్పుడో..!



నిలిచిపోయిన డీపీఎల్ క్యాంపులు

- కు.ని శస్త్రచికిత్సలకు బ్రేక్
- ఎనిమిది నెలలుగా మహిళల ఎదురుచూపులు

చేవెళ్ల: కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కోసం మహిళలు ఎనిమిది నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన డీపీఎల్ క్యాంపులో ఆపరేషన్లు వికటించి నలుగురు మృతి చెందడం.. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఘటన సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శస్త్రచికిత్సలు చేసిన వైద్యులు, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవటంతోపాటు డీపీఎల్ క్యాంపులను సైతం ప్రభుత్వం రద్దు చేసింది. తిరిగి ప్రారంభించే విషయమై ఎనిమది నెలలు గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

డీపీఎల్ ఆపరేషన్లకే మొగ్గు

మహిళలు గతంలో ఎక్కువగా ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకునేవారు. రిస్క్‌తో పాటు ఎక్కువ కాలం పాటు విశ్రాంతికోసం బెడ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఎదురయ్యేది. ఆపరేషన్లు చేసి కుట్లు వేయడంతో వెంటనే పనులు చేసుకునేందుకు వీలు పడేది కాదు. ప్రభుత్వం దీనిపై ఆలోచించి మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ సమయంలో ఎక్కువ మందికి రెండు, మూడురోజుల విశ్రాంతితోనే కు.ని ఆపరేషన్లు చేసే డీపీఎల్(డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్) శిబిరాలకు శ్రీకారం చుట్టింది. ఆయా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య బృందం వెళ్లి క్యాంపులు నిర్వహించటం మొదలు పెట్టింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ట్యూబెక్టమీ ఆపరేషన్లకు రూ.10వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆపరేషన్లు చేయించుకున్న మహిళలు 15 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. వారం రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాలి. డీపీఎల్ అయితే చేసిన నాలుగు గంటల తర్వాత ఇంటికి వెళ్లి మూడు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. దీంతో మహిళలు ఎక్కువగా వీటివైపే మొగ్గు చూపిస్తున్నారు.

గత్యంతరం లేక ప్రైవేటు వైపు..

జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 36 డీపీఎల్ క్యాంపులను నిర్వహించారు. ఇందులో 2022 ఏప్రిల్‌లో 5 క్యాంపులు, జూన్‌లో 7, జూలై, ఆగస్టులో 12 చొప్పున శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో మొత్తం 1,933 మంది మహిళలు ఆపరేషన్లు చేయించుకున్నారు. ప్రతి నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు 100 మందికిపైగా డీపీఎల్ క్యాంపుల ద్వారా కు.ని ఆపరేషన్లు చేయించుకునేవారు. ప్రస్తు తం వీటిని నిలిపివేయటంతో మహిళలు అంతా ప్రైవేటు ఆస్పత్రుల్లో ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే డీపీఎల్ క్యాంపులపై నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



డీపీఎల్ క్యాంపులు ప్రస్తుతం నిర్వహించడం లేదు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం సంఘటనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తిరిగి ప్రారంభిస్తాం. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ట్యూబెక్టమీ, వేసక్టమీ ఆపరేషన్లు చేస్తున్నారు. వాటిని ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సబితారెడ్డి

‘ఎస్‌ఎన్‌డీపీ’ పనులను వేగవంతం చేయండి

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను వేగవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ 36వ డివిజన్ ఎంఎల్ఆర్ కాలనీ, 32వ డివిజన్ అయోధ్య నగర్, 31వ డివిజన్ జనప్రియ మహానగర్ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలా పనులు జరుగుతున్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మంత్రాల చెరువు వద్ద చేపడుతున్న వీధి వ్యాపారుల సముదాయం, వాకింగ్ ట్రాక్ బ్రిడ్జి పనులను పూర్తిచేయాలన్నారు. మంత్రి వెంట మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ నర్సింహ, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్‌గౌడ్, రాజు, కాలనీవాసులు కృష్ణారెడ్డి, కృష్ణ, కిషోర్ తదితరులు ఉన్నారు. 31వ డివిజన్ పరిధి జనప్రియ మహానగర్‌లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు, 32వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నూతన రోడ్ల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయడంపై స్థానిక కార్పొరేటర్లు విజయలక్ష్మి, నర్సింహ, కాలనీవాసులతో కలిసి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్ బంకులకు తాకిడి

- రూ.2 వేల నోట్లకు చిల్లర కోసం వాహనాల్లో పెట్రోల్
- రూ.1000 దాటితే ఓకే.. లేదంటే నో చిల్లర
- పెరిగిన పెట్రోల్, డీజిల్ విక్రయాలు
- బంగారం షాపులకు సైతం ఇదే పరిస్థితి



ఓ పెట్రోల్ బంక్ వద్ద పెట్టిన బోర్డు

సాక్షి, సిటీబ్యూరో: పెట్రోల్ బంకులకు రూ.2 వేల నోట్ల తాకిడి పెరిగింది. బంకుల్లో నోట్ల వినియోగానికి వెసులుబాటు ఉండటంతో వాహనదారులు ఇంధనం పేరిట నోట్ల మార్పిడికి ప్రయత్నిస్తున్నారు. బంకుకు వచ్చే వాహనదారుల్లో సగానికి పైగా రూ.2 వేల నోటు ఇస్తుండటంతో పెట్రోల్ బంకుల డీలర్లకు చిల్లర సమస్యగా తయారైంది. దీంతో కనీసం రూ.1000 ఇంధనం వాహనంలో పోయించుకుంటే తప్ప రూ. 2వేల నోట్లు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. కొన్ని బంకుల్లో నోటుకు చిల్లర యూపీఐ, బీమ్, పేటీఎం ద్వారా చెల్లిస్తున్నారు. మరికొన్ని పెట్రోల్ బంకులు మాత్రం రూ.2వేల పైనే విలువ గల ఇంధనం పోయిస్తేనే రూ. 2 వేల నోటు తీసుకుంటామని ఏకంగా బోర్డులు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఆర్‌బీఐ రూ.2 వేల నోట్లు పూర్తిగా రద్దు చేయడంతో వాటిని మార్చుకోవడానికి ఉరుకులు పరుగులు తీస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం బ్యాంకుల్లో సెప్టెంబర్ 30 వరకు మార్చుకోవడానికి అవకాశం ఉండటంతో అక్కడ రద్దీ పెరిగింది. దీంతో పెట్రోల్ బంకులు, జ్యువెలరీ షాపుల్లో మార్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

పెరిగిన విక్రయాలు..

మహానగర పరిధిలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ అమ్మకాలు పెరిగాయి. మూడు ప్రధాన ఆయిల్ కంపెనీలకు చెందిన సుమారు 560 పెట్రోల్, డీజిల్ బంకులు ఉండగా ప్రతిరోజు సగటున 50 లక్షల లీటర్ల పైబడి డీజిల్, పెట్రోల్ డీజిల్ అమ్మకాలు సాగుతుంటాయి. ఆయిల్ కంపెనీల టెర్మినల్స్ నుంచి ప్రతి రోజు పెట్రోల్ బంకులకు 170 నుంచి 200 ట్యాంకర్ల ద్వారా ఇంధనం సరఫరా అవుతోంది. ఒక్కో ట్యాంకర్‌లో సగటున 12 నుంచి 30 వేల లీటర్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. మూడు రోజులుగా సుమారు 20 నుంచి 30 శాతం అమ్మకాలు ఎగబాకడంతో సరఫరాకు మరింత డిమాండ్ పెరిగింది.

జ్యువెలరీ షాపులకు పరుగులు..

జ్యువెలరీ షాపులకు రూ. 2వేల నగదు తాకిడి అధికమైంది. వాస్తవంగా గతంలో బంగారం ఇతరత్రా ఆభరణాల కొనుగోళ్లలో రూ.2వేల నోటు వాడకం ఎక్కువ రెండు శాతమే ఉండేది. ప్రస్తుతం 60 నుంచి 80 శాతం పెరిగినట్లు ఓ జ్యువెలరీ షాపు యజమాని తెలిపారు.

పవర్‌ఫుల్!

- తొమ్మిదేళ్లలో రెట్టింపైన విద్యుత్ వినియోగం
- 2014లో పీక్ సీజన్ గరిష్ట డిమాండ్ 48 ఎంయూలు
- ఈ నెల 19న రికార్డు స్థాయిలో 80 మిలియన్ యూనిట్లు



సంవత్సరం	మిలియన్ యూనిట్లు	గరిష్ట డిమాండ్
2014	49.05	2,202 మెగావాట్లు
2023	80.00	3,775 మెగావాట్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నగరం శరవేగంగా విస్తరిస్తోంది. కోర్ సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గృహ, వాణిజ్య, పారిశ్రామిక భవనాలు వెలుస్తున్నాయి. నెలకు సగటున 2,500– 3,000 వరకు కొత్త విద్యుత్ కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా ఏటా విద్యుత్ వినియోగం రెండు నుంచి మూడు శాతం అధికంగా నమోదవుతున్నట్లు అంచనా. రోజురోజుకూ పుట్టుకొస్తున్న కొత్త కనెక్షన్లకు తోడు విద్యుత్ గృహోపకరణాల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఒకప్పుడు ధనవంతుల ఇళ్లలో మాత్రమే కనిపించిన ఏసీలు, గ్రీజర్లు, రిఫ్రిజిరేటర్లు, కంప్యూటర్లు.. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ సర్వసాధారణమయ్యాయి. ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతున్నాయి. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు రోజంతా ఆన్ చేసి ఉంచుతున్నారు. ఫలితంగా గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ పీక్ స్థాయికి చేరుకుంది.

రికార్డుస్థాయిలో డిమాండ్

రాష్ట్ర ఏర్పాటు సమయంలో గ్రేటర్ పీక్ సీజన్ డిమాండ్ 48 నుంచి 49 మిలియన్ యూనిట్లు నమోదు కాగా.. ప్రస్తుతం రికార్డు స్థాయిలో నమోదవుతోంది. గత శుక్రవారం (19న) డిస్కం చరిత్రలోనే అత్యధికంగా 80 మిలియన్ యూనిట్లు నమోదైంది. రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ మరింత పెరుగుతుండటంతో ఇంజినీర్లు బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వస్తున్న ఒత్తిడి తట్టుకోలేక ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం తీవ్ర ఒత్తిడికి గురవుతుండటం, ఆయిల్ లీకేజీల కారణంగా బస్తీల్లోని పలు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అవుతుండటం, గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు ఆయా సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నారు.

ముగిసిన సీఎం కప్

- విజేతలకు అవార్డుల ప్రదానం

హుడాకాంప్లెక్స్: మూడు రోజులుగా సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన సీఎం కప్–2023 క్రీడా పోటీలు బుధవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. 18 అంశాల్లో పోటీలు నిర్వహించగా 1,236 మంది మండల, జిల్లాస్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 238 మంది జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చారు. వీరిని ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహిం చానున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరికి జిల్లా యువజన క్రీడాధికారి వెంకటేశ్వర్‌రావు, సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హరి కృష్ణయ్య, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ దివాకర్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి మనోహర్, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పురుషుల విభాగంలో మెడల్స్ అందుకుంటున్న అబ్దుల్లాపూర్‌మెట్ జట్టు

వాలీబాల్

- మొదటి విజేత : పురుషుల విభాగంలో ఫరూఖ్ నగర్ మండలం, మహిళా విభాగంలో తలకొండపల్లి మండలం
- రెండో విజేత : పురుషుల విభాగంలో గండిపేట మండలం, మహిళా విభాగంలో యాచారం మండలం

కబడ్డీ

- మొదటి విజేత : పురుషుల విభాగంలో అబ్దుల్లా పురమేట్ మండలం, మహిళా విభాగంలో సరూర్ నగర్ మండలం
- రెండో విజేత: పురుషుల విభాగంలో సరూర్ నగర్ మండలం, మహిళా విభాగంలో బాలాపూర్ మండలం

ఖోఖో

- మొదటి విజేత : పురుషుల విభాగంలో సరూర్ నగర్ మండలం, మహిళా విభాగంలో హయత్ నగర్ మండలం
- రెండో విజేత: పురుషుల విభాగంలో హయత్ నగర్ మండలం, మహిళా విభాగంలో యాచారం మండలం

ఫుట్‌బాల్

- మొదటి విజేత : పురుషుల విభాగంలో సరూర్ నగర్ మండలం
- రెండో విజేత: పురుషుల విభాగంలో యాచారం మండలం

బాస్కెట్ బాల్

- మొదటి విజేత : పురుషుల విభాగంలో సరూర్ నగర్ మండలం
- రెండో విజేత: పురుషుల విభాగంలో హయత్ నగర్ మండలం

దొంగ పోలీస్!

- నకిలీ ఐపీఎస్ నాగరాజు అరెస్టు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, పదవులు ఇప్పిస్తానని మోసం
- కోడి రక్తం చల్లి.. ఎన్‌కౌంటర్‌గా నమ్మించిన వైనం



సాక్షి, సిటీబ్యూరో: ఐపీఎస్, ఆర్మీ ఆఫీసర్‌గా అవతారమెత్తి.. సామాన్యులను కిడ్నాప్ చేసి బెదిరించి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని చిక్కాల గ్రామానికి చెందిన నాగరాజు కార్తీక్ రఘువర్మ సైబరాబాద్ పోలీసులకు చిక్కాడు. తెలంగాణ, ఢిల్లీ పోలీసు, డిఫెన్స్ విభాగానికి చెందిన నకిలీ ఐడీ కార్డులను సృష్టించిన నాగరాజు మీద తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలలోనూ కేసులున్నాయి. ఈ మేరకు మాదాపూర్ ఇన్‌చార్జి డీసీపీ శ్రీనివాసరావు బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

కార్లు దొంగిలించి..

డిగ్రీ పూర్తయ్యాక 2016లో హైదరాబాద్‌కు వచ్చిన నాగరాజు.. సనత్‌నగర్‌లో క్యాబ్ డ్రైవర్‌గా చేరాడు. అక్కడ ఇన్నోవా కారును చోరీ చేశాడు. దీంతో యజమాని ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు నాగరాజును అరెస్టు చేశారు. బెయిల్ మీద బయటకు వచ్చి మహారాష్ట్రకు వెళ్లి బోర్‌వెల్‌లో నాలుగు నెలల పాటు పని చేశాడు. తిరిగి 2018లో హైదరాబాద్‌కు వచ్చి బంజారాహిల్స్‌లోని వరిష్టా ఇన్ఫోకామ్ కంపెనీ ప్రొప్రైటర్ రాధాకృష్ణ కారు డ్రైవర్‌గా చేరాడు. యజమానికి చెప్పకుండా కారును దొంగిలించి పరారయ్యాడు. దీంతో పోలీసులు నాగరాజును అరెస్టు చేసి మరోసారి జైలుకు పంపించారు.

ఆర్మీ శిక్షణ ఇస్తానని వసూళ్లు..

బెయిల్ మీద బయటకు వచ్చిన నాగరాజు గచ్చిబౌలిలో ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో సూపర్‌వైజర్‌గా చేరాడు. ఆర్మీపై అవగాహన పెంచుకుని..ఆర్మీలో స్పెషల్ ఫోర్స్ మేజర్ ర్యాంకు పారా ఎస్ఎఫ్ రెజిమెంట్ డ్రెస్ కొనుగోలు చేశాడు. హైదరాబాద్ నుంచి సొంతూరు చిక్కాలకు వెళ్లిపోయి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు ఆర్మీ ఆఫీసర్‌గా ఎంపికయ్యానని నమ్మించాడు. ధోని, డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ బిపిన్ రావత్‌లతో ఉన్నట్లు ఫొటోలు మార్ఫింగ్ చేశాడు. స్థానిక యువత, నిరుద్యోగులను పోగు చేసి.. వారికి ఆర్మీ శిక్షణ ఇస్తానని ప్రచారం చేశాడు. అక్రమంగా సైనిక్ డిఫెన్స్ ట్రయినింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. శిక్షణ పేరుతో సామాన్యుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. పోడూరు పోలీసులు విచారణ జరిపి, నాగరాజును అరెస్టు చేసి, జైలుకు పంపించారు.

కిడ్నాప్‌లు చేసి చిత్రహింసలు..

ఈ ఏడాది జనవరిలో ఝార్ఖండ్‌లోని కుందా గ్రామానికి వెళ్లి తుపాకీ, తొమ్మిది బుల్లెట్లను కొనుగోలు చేశాడు. అనంతరం మదీనాకు వెళ్లి పోలీసు యూనిఫామ్, వాకీటాకీ, ఫ్లాష్‌లైట్, సంకెళ్లు, లాఠీ, చెయిన్, పిస్టోల్ పౌచ్ ఇతరత్రా వస్తువులను కొనుగోలు చేశాడు. స్నేహితులు అనిల్ కుమార్, దీపక్ కుమార్, శ్రీశైలం, పైలా స్వామి, సత్యనారాయణలతో కలిసి అమాయకులను కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేసేవాడు. కేసులు నమోదు చేస్తానని బెదిరించి వారి నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసేవాడు.

కోడి రక్తం చల్లి.. ఎన్‌కౌంటర్ సృష్టించి..

ఏలూరుకు చెందిన మేకపాటి రవిశంకర్ ఉద్యోగాల పేరిట పలువురు నిరుద్యోగులను మోసం చేయగా.. దీన్ని నాగరాజు అవకాశంగా మలుచుకున్నాడు. బాధితులకు అంతర్రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ అనలిటికల్ ఆఫీసర్‌గా పరిచయం చేసుకొని రవిశంకర్ నుంచి డబ్బులు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి రూ.3.70 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత రవిశంకర్‌ను కిడ్నాప్ చేసి, ఇంటరాగేషన్ పేరుతో చిత్రహింసలకు గురిచేశాడు. రవిశంకర్ వద్ద డబ్బులు లేవని గుర్తించి కొత్త పథకం రచించాడు. బాధితుల బారినుంచి బయటపడేస్తానని రవిశంకర్‌కు చెప్పి నకిలీ ఎన్‌కౌంటర్ కథ అల్లాడు. రవిశంకర్ దుస్తులపై కోడి రక్తం చల్లి..చంపేసినట్లుగా వీడియో తీయించి నిరుద్యోగ బాధితులకు పంపించాడు. రవిశంకర్ కుటుంబ సభ్యుల నుంచి దీనికోసం రూ.2 లక్షలు తీసుకున్నాడు.

- ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు.. వంద ఫీట్లరోడ్‌లోని ఫ్యాబ్ ఓయో హోటల్‌లో నాగరాజును అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 7.65 కంట్రీమేడ్ తుపాకీ, 9 లైవ్ రౌండ్ బుల్లెట్లు, పోలీసు, ఆర్మీ దుస్తులు, టోపీ, బూట్లు నకిలీ ఐడీ కార్డులు, నాలుగు ఫోన్లు, ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.



నాట్య నీరాజనం

రవీంద్రభారతిలో బుధవారం శ్రీరాధికా సంగీత నృత్య అకాడమీ, మాంగళ్యం ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని నృత్య నీరాజనం నిర్వహించారు. పలువురు నాట్య గురువులను సత్కరించారు. అంతకు ముందు ఎన్టీఆర్ శాస్త్రీయ సంగీత పాటలకు కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– గన్‌ఫౌండ్రీ

ఆగివున్న టిప్పర్‌ను ఢీకొన్న డీసీఎం

- ఇద్దరు కూలీల దుర్మరణం
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

పహాడీషరీఫ్: రోడ్డు పక్క ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి డీసీఎం (పౌల్ట్రీ ఫాం నుంచి కోళ్లు తరలించే వాహనం) వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్‌లోని ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన మహ్మద్ రహ్మత్ కల్వకుర్తిలోని ఓ పౌల్ట్రీ ఫాంకు చెందిన డీసీఎం వ్యాన్‌కు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం వాహనంలో కోళ్లు వేసుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు. తుక్కుగూడ మీదుగా నగరానికి వస్తున్న క్రమంలో కళాశ్రీ గార్డెన్ వద్ద రోడ్డు పక్క ఆపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డీసీఎం వాహనంలోని మల్కాజ్‌గిరి, ప్రశాంత్ నగర్‌కు చెందిన పౌల్ట్రీ ఫాం కూలీలు రోషన్ కుమార్(21), సీప్ కుమార్(22) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐలమ్మ విగ్రహ వివాదం.. ఉద్రిక్తత


అనుమతులు లేవని విగ్రహాన్ని తొలగించి దిమ్మెను కూల్చేసిన పోలీసులు


యాచారంలో ప్రతిష్ఠించిన చాకలి ఐలమ్మ విగ్రహం

అనుమతులు లేవని దిమ్మె కూల్చేసిన పోలీసులు

యాచారం: చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. యాచారంలోని మొండిగౌరెల్లి చౌరస్తాలో రజక సంఘాల నాయకులు బుధవారం తెల్లవారుజామున ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయితే అనుమతి లేకుండా విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని పోలీసులు అభ్యంతరం తెలిపారు. విగ్రహాన్ని తొలగించి, జేసీబీతో దిమ్మెను కూల్చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, రజక సంఘం శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంపీపీ కొప్పు సుకన్య, బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ తదితరులు రజక సంఘం నాయకులకు మద్దతుగా నిలిచారు. యాచారంతో పాటు పలు గ్రామాల్లోని అనేక విగ్రహాలకు అసలు అనుమతులు ఉన్నాయా అని నిలదీశారు. సీఐ లింగయ్య ఎంపీపీతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఏ విగ్రహాలు పెట్టాలన్నా అనుమతులు కచ్చితంగా అవసరమని, అనుమతి తీసుకొని ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. దీంతో రజక సంఘం నేతలు ఐలమ్మ విగ్రహాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచారు. ఎంపీపీ కొప్పు సుకన్య కూల్చేసిన దిమ్మెను దగ్గరుండి నిర్మించారు. కాగా, ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

కళ్లల్లో కారం చల్లి పుస్తెలతాడు అపహరణ

గంటలో దొంగను పట్టుకున్న యాచారం పోలీసులు

యాచారం: మహిళ కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. ఈ ఘటన మండల కేంద్రమైన యాచారం బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సీఐ లింగయ్య తెలిపిన వివరాలు.. యాచారానికి చెందిన పెరుమల్ల ప్రేమలత మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటి వద్ద మరో మహిళతో మాట్లాడుతోంది. అదే సమయంలో మొహానికి బట్ట కట్టుకున్న వ్యక్తి వచ్చి ప్రేమలత కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. బాధితురాలు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమలత.. దొంగ ఆనవాళ్లు చెప్పడంతోపాటు ఫలానా వ్యక్తే అయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తానే దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్ సుస్మితకు సన్మానం


సుస్మితను సన్మానిస్తున్న వైఎస్సార్ టీపీ నేత ఇబ్రహీం

షాద్‌నగర్ రూరల్: సివిల్ సర్వీసెస్ -2022 తుది ఫలితాల్లో పట్టణానికి చెందిన ఇప్పలపల్లి సుస్మిత ఆల్ ఇండియా 384వ ర్యాంకు సాధించడంతో బుధవారం పలువురు నేతలు ఆమెను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, కౌన్సిలర్ కే మహేశ్వరి, పీసీసీ సభ్యుడు కే శ్రీనివాస్‌గౌడ్ సుస్మితను సన్మానించారు. స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన సుస్మిత ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ఆశయానికి అనుగుణంగా ఎంతో కష్టపడి సివిల్స్ ర్యాంకు సాధించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

27న చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: బీఎస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన ఓపెన్, అండర్-13 విభాగాల్లో చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. కొత్తపేట అల్కాపురి రోడ్ నంబర్-2లో ఉన్న బీఎస్ చెస్ అకాడమీలో ఈ టోర్నీని ఏర్పాటు చేశారు. ఓపెన్ కేటగిరీలో టాప్-15లో నిలిచిన వారికి... అండర్-13 విభాగంలో టాప్-3లో నిలిచిన వారికి నగదు పురస్కారాలు అందజేస్తారు. అండర్-7, అండర్-9, అండర్-11 విభాగాల్లో టాప్-3లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు ఉంటాయి. ఈ టోర్నీలో పాల్గొనాలనుకునేవారు ఈనెల 26వ తేదీలోపు తమ ఎంట్రీలను ఖరారు చేయాలి. ఇతర వివరాలకు కోచ్ బొల్లం సంపత్‌ను 9066567567 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ రమాదేవి


చేవెళ్లలో సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ రమాదేవి, ఏఓ తులసీ

చేవెళ్ల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని చేవెళ్ల డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమాదేవి హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు సీడ్స్ దుకాణాలను ఆమె ఏవో తులసీతో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. ప్రతి డీలర్ దుకాణం ముందు సూచిక బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందులో విత్తనాల ధరలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఆ బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. పంట దెబ్బతిన్న సమయంలో ఆ బిల్లు ఆధారంగానే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రైతులు సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో అడ్డాకూలీ మృతి


రవి మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు.. షాద్‌నగర్‌కు చెందిన కావలి రవి(45).. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి లెనిన్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు అడ్డామీదకు వెళ్లి కిరాయికి మాట్లాడిన చోట కూలి పనులు చేస్తుంటాడు. ఒక్కోసారి పని ఎక్కువుంటే ఇంటికి తిరిగిరాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఎప్పటిలాగే పనికోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి తిరిగి రాలేదు. బుధవారం తెల్లవారుజామున నాదర్‌గుల్ సమీపంలోని గ్రీన్‌హోమ్స్ కమాన్ వద్ద ఇసుకలో రవి మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు రవి ఉబ్బస వ్యాధితో బాధపడుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్: ఫిలింనగర్ రోడ్ నెం.9లోని డీటైప్ క్వార్టర్స్‌లో కె.శ్రీనివాస్(32) అనే వ్యక్తి సిగ్నేచర్ వెల్‌నెస్ స్పా పేరుతో ఓ స్పాను నిర్వహిస్తున్నాడు. దీని ముసుగులో వ్యభిచార గృహాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకుడితో పాటు క్రాస్ మసాజ్ చేస్తున్న యువతులను అదుపులోకి తీసుకున్నారు. ఈజీ మనీ కోసం అలవాటుపడ్డ శ్రీనివాస్ సిగ్నేచర్ వెల్‌నెస్ స్పాను ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల నుంచి యువతులను రప్పించి థెరపిస్టుల పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి స్పాపై దాడి చేసి యువతులను అదుపులోకి తీసుకున్నారు. మహిళల అక్రమ రవాణాతో పాటు వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లుగా ఈ తనిఖీల్లో తేలింది. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 370, 370ఏ, ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్ 1956 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐహెచ్ఎంసీఏకు అరుదైన గుర్తింపు

బంజారాహిల్స్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కలినరీ ఆర్ట్స్ (ఐఐహెచ్ఎంసీఏ) కాలేజీకి అరుదైన గుర్తింపు దక్కిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ గౌతమ్ కరింగి తెలిపారు. ప్రముఖ అవుట్ లుక్ ఇండియా మేగజైన్ నిర్వహించిన సర్వేలో దేశంలోనే ఈ కాలేజీకి రెండో ర్యాంకును కేటాయించిందని చెప్పారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌లో మేనేజ్‌మెంట్ విద్యార్థులు పలు రకాల వంటకాలను ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ సూరజ్ మాట్లాడుతూ ఏటా తమ కాలేజీ నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్లకు 400మంది చెఫ్‌లను అందిస్తున్నామని తెలిపారు.

ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ


ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందించే విలేకరులకు ప్రెస్‌క్లబ్ భవనం వేదికగా ఉంటుందన్నారు. మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు దాతలు సహకరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహేష్‌బాబు, జెడ్పీటీసీ స్వరూప, స్థానిక సర్పంచ్ స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఔటర్‌పై కారులో మంటలు

త్రుటిలో తప్పించుకున్న డ్రైవర్


ఔటర్‌పై కారుకు వ్యాపించిన మంటను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

శంషాబాద్ రూరల్: రోడ్డుపై వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయగా..కారు నడుపుతున్న డ్రైవర్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆలీకోల్‌తండాకు చెందిన జెర్పుల రవి బుధవారం రెనాల్ట్ డస్టర్ కారులో ఔటర్ మీదుగా నార్సింగి నుంచి శంషాబాద్ వస్తున్నాడు. కిషన్‌గూడ సమీపంలోకి రాగానే కారులో మంటలు చెలరేగాయి. గమనించిన రవి కారును కాపి కిందకు దిగారు. కొద్ది సేపటికే కారులో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

మిస్ గార్జియస్ ఆఫ్ తెలంగాణగా అపర్ణ


అందాల పోటీల విజేతలు

బంజారాహిల్స్: మిస్ గార్జియస్-2023 ఏపీ, తెలంగాణ పేరుతో టోగుల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఓ స్టార్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన అందాల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో మిస్ తెలంగాణ టైటిల్‌ను అపర్ణ గెలుచుకోగా, సెకండ్ రన్నరప్‌గా సురేఖా బాన్సోడ్, ఫస్ట్ రన్నరప్‌గా అర్పి ప్రొద్దుకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా టోగుల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత రఘు బొద్దు మాట్లాడుతూ... 2015 నుంచి ప్రతి సంవత్సరం తమ సంస్థ ఆధ్వర్యంలో అందాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాషన్ ఇండస్ట్రీ, సినిమా రంగం పట్ల ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ ఇచ్చి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ ఫ్యాషన్ కొరియోగ్రాఫర్ అరుణ్ రత్నాతో ర్యాంప్ వాక్‌పై ట్రైనింగ్ ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీరియల్ హీరో దత్తు, జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి, ప్రవీణ్, చిరంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మారిషస్ పాస్‌పోర్టు కలిగిన ఇద్దరు పంజాబీల అరెస్టు

శంషాబాద్: నకిలీ మారిషస్ పాస్‌పోర్టు కలిగిన ఇద్దరు పంజాబీలను ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం కపూర్తలకు చెందిన అవతార్ సింగ్ (39, సుఖ్‌దేవ్ సింగ్(27) ప్రైవేటు ఉద్యోగులు ఈ నెల 23 దుబాయ్ నుంచి ఇండియన్ పాస్‌పోర్టులపై శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇండియన్ ఇమిగ్రేషన్‌లో వీరిద్దరు రిపబ్లికన్ మారిషస్ పాస్‌పోర్టులు చూపించి వాటిపై స్టాంపింగ్ వేయించుకునేందుకు యత్నించారు. అప్రమత్తమైన అధికారులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నెల 5న ఇద్దరు అమృత్‌సర్ నుంచి దుబాయ్ వెళ్లారు. అక్కడ ఓ ఏజెంట్ ద్వారా మారిషస్‌కు చెందిన నకిలీ పాస్‌పోర్టులు కొనుగోలు చేశారు. ఇండియాకు చేరుకున్న తర్వాత నకిలీ మారిషస్ పాస్‌పోర్టుల ద్వారా ఇక్కడి నుంచి తిరిగి ఇటలీ వెళ్లేందుకు ప్రణాళిక వేశారు. నకిలీ పాస్‌పోర్టులతో ఇమిగ్రేషన్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో పట్టుబడ్డారు. ఇమిగ్రేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు ఇద్దరిని ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.